చెట్టునీడనా, జంపుకానామీద అందరూ డాన్స్ ఆరంభించారు. చంద్రశేఖర్ వచ్చి చేయి అందించగానే గీత కరకుగా అతని కళ్ళల్లోకి చూసి విసురుగా చేయి అందించింది. గీత నడుంచుట్టూ యెడమచేయి వేసి కుడిచేత్తో ఆమె చేయి అందిపుచ్చుకుని స్టెప్సువేస్తూ శేఖర్ కొన్నిక్షణాలు మౌనంగా గీత మొహంలోకి చూస్తూ వుండిపోయాడు. గీత మొహం తిప్పుకుంది. చుట్టూ చూసింది. రాంమోహన్ మహదానందంగా యీ లోకంలో లేనట్టు కవితతో డాన్స్ చేస్తూ ఆమె నడుంచుట్టూ చేయి గట్టిగా బిగించి చెవిలో యేదో అంటున్నాడు. కవిత కొంటెగా నవ్వుతుంది. మిగతా అందరూ యెవరి పార్ట్‌నర్‌తో వాళ్ళు గుసగుసలాడుతున్నట్టు మాట్లాడుతున్నారు.

"గీతా!" నెమ్మదిగా పిల్చాడు శేఖర్.

"కాల్ మీ మిసెస్ రాం" గీత చురుకుగా చూసి అంది కఠినంగా.

"గీతా! ఎందుకంత కోపం. ఎన్నాళ్ళయినా నీ కోపం తగ్గదా?" కళ్ళలోకి చూస్తూ ఆవేదనగా అన్నాడు. గీత మొహం తిప్పుకుంది.

"గీతా! ప్లీజ్! మాట్లాడు. నీతో మాట్లాడే యీ అవకాశంకోసం యెన్నాళ్ళనించో యెదురుచూస్తున్నాను. నీతో యేకాంతంకోసమే యీ గేమ్ సృష్టించాను. నిన్ను పార్ట్‌నర్‌గా చేసుకున్నాను."

"అయితే యిదంతా ముందే ఆలోచించి వేసిన ప్లానన్నమాట" గీత తీక్షణంగా అంది.

"అవును. నీ చీటి మిగతా వాటికంటె కాస్త వెడల్పుగా మడిచి, అందరికంటె ముందుగా నేను తీసుకున్నాను. గీతా నాకు మాట్లాడటానికి యీ ఒక్క అవకాశం యియ్యి" ప్రాధేయపడ్డాడు.

"నీతో నాకు మాటలేమిటి? ఇంకా మనకి మాటలేం మిగిలాయి. ఐహేట్‌యూ-ఐహేట్‌యూ" తిరస్కారంగా అంది. కాస్త దగ్గరలోవున్న వర్మ గొంతులో తీక్షణత గుర్తించి, 'గీతాకీ క్యాహువా?' అన్నాడు. గీత చప్పున మొహంలో భావం మార్చేసి నవ్వుతూ, "మిస్టర్ చంద్రా!

చూడండి, ఇంత క్విక్ స్టెప్పు వేస్తూవుంటే మరోపార్టనర్‌ని తెచ్చుకోమని కేకలేస్తున్నాను" అంది.

"గీతా! నన్నెందుకు అర్ధంచేసుకోటానికి ప్రయత్నించవు. నేను చెప్పేది విన్నాక నీ యిష్టం, నీవేమన్నా పడతాను" శేఖర్ మళ్ళీ ఆరంభించాడు.

"గీతా! మూడేళ్ళనించి ప్రయత్నిస్తున్నాను నీతో మాటాడే యీ అవకాశం కోసం. గీతా నీతో మాట్లాడటంకోసం మంచి ఉద్యోగం వదులుకుని యీ వూరు వచ్చానని నీకు తెలుసా? నీకోసం మీ ఆయనతో స్నేహం సంపాదించాను తెటుసా...."

"ఇప్పుడేమి చేద్దామని వచ్చావు మిస్టర్! ఇటీజ్ టూ లేట్. సుఖముగా సాగిపోతున్న నా సంసారంలో నిప్పులు పోయడమే నీ ఉద్ధేశ్యమయితే అదిమాత్రం చేయగలవు" కఠినంగా అంది గీత.

"గీతా!" హర్ట్ అయ్యాడు శేఖర్. "ఎందుకంత కఠినంగా మాటాడతావు. అంత నీచుడిలా కనిపిస్తున్నానా. చేసిన చిన్న తప్పుకి ఇంత పెద్ద శిక్ష వేశావు. కనీసం నా బాధయినా అర్థం చేసికోలేవా?" గిలగిలలాడాడు.

"నీ బాధ నా బాధ కాదు కనక అర్థంచేసుకోవాల్సిన అవసరం నాకు లేదు."

"నీదింత కఠిన హృదయమని యెన్నడూ అనుకోలేదు. అసలు జరిగిన సంగతి విని .. "

"మిస్టర్ వృధా శ్రమ పడకు. ఆ సంగతులు వినాలని నాకు లేదు. ఆ సంగతులు గుర్తూలేవు. అవన్నీ మరిచేపోయి చాలాకాల మయింది" బింకంగా అంది గీత.

"అబద్ధం. నీవు మరవలేవు. అది నాకు తెలుసు. మరచిపోయానని ఆత్మవంచన చేసుకుంటున్నావు. నీవు నన్ను మరిచిపోలేదని ఆరోజు-నన్ను మీ యింటిలో చూడగానే ఆ విషయం నీ మొహమే చెప్పింది."

పోయినా. అంతా తలలు వూపారు. ప్రేమించిన ప్రియురాలు అపార్థం చేసుకుని ప్రేమను కాలదన్ని వెళ్ళిపోతే, ప్రియుడు ఆవేదనతో పాడే పాట అది. పాటలో భావానికి గీత మొహం యెర్రబడింది. అతని గొంతులో కంపనకి గీత అదోలా అయింది.

"వండర్‌ఫుల్ ... భగ్న ప్రేమికుడి వేమిటోయి చంద్రా - అంతలా పాడి వప్పించావు విషాదం-ఎవరోయి ఆ లైలా!" హాస్యం ఆడాడు రాంమోహన్. "ఏమండీ పద్మా! మీ వారికి పార్వతి మీరు కాదేమిటి?"

"పెళ్ళాన్ని ప్రియురాలిగా భావించుకునే మగాళ్ళున్నా రేమిటి?" చురక అంటించింది పద్మ.

"అన్యాయం? మీరు తెలుగులో యేమిటో మాట్లాడుతున్నారు మాకు తెలియకుండా" చటర్జీ అన్నాడు. రాంమోహన్ పాటలో భావం తమ మాటలు ఇంగ్లీషులో చెప్పాడు.

"హాయ్ చంద్రా! ఏమిటి సంగతి-చెప్పవోయ్ సరదాగా" కపూరు హాస్యం ఆడాడు.

"అరే బాబూ! ఇది పాట. రాసింది నేను కాదు. మతిపోయిందా యేమిటి మీకు" అన్నాడు నవ్వి శేఖరు.

వర్మ పాటవంతు వచ్చేసరికి గురక విన్పించింది. అదే ఆయన పాట. లేపినా అంతకంటె మంచిపాట మనం యెలాగో వినలేం. పడుకోనీయండి" అంది లత నవ్వుతూ. ఒక్కొక్కరూ బద్ధకంగా ఆవులిస్తూ తలగడమీద వరిగిపోయారు. గీతకి నిద్రపట్టలేదు. మరొక జంపుకానామీద మగవాళ్ళంతా పడుకున్నారు. చంద్రశేఖరు వెల్లకిలా పడుకుని సిగరెట్ కాలుస్తున్నాడు. ఈ చంద్రశేఖరు మళ్ళీ తన జీవితంలో యెందుకు ప్రవేశించాడో! గతమంతా తుడిచేసుకుని, పెళ్ళిచేసుకుని కొత్తగా రాంమోహన్ మనసులో స్థానం యేర్పరచి గతం మరిచిపోయింది. ఆనాడు చంద్రపట్ల అంత యేహ్యత పెరగకపోతే యింత సుళువుగా మరిచిపోగలిగేదా? మరిచిపోయిందా! నిజంగా తుడిచేసుకుందా అతని రూపుని?! మళ్ళీ .. మళ్ళీ తన మనశ్శాంతిని హరించడానికి వచ్చిన అతన్ని గీత క్షమించలేకపోతూంది.

రాంమోహన్ కోపంగా చంద్రశేఖర్ దగ్గరకి వెళ్ళి కఠినంగా "ఏం చేశావు గీతని.... చెప్పు?" అన్నాడు పళ్ళబిగువున. చంద్రశేఖర్ అయోమయంగా చూశాడు గీతని-అందరిని. ఆమె చరచరా వచ్చి రాంమోహన్‌ని పక్కకి లాగి చంద్రశేఖర్ వంక చూస్తూ "మిష్టర్ మీ బెల్టు యిస్తారా?" అంది అంతా ప్రాణంలేని బొమ్మల్లా నిలబడ్డారు. శేఖర్ గీతని చూస్తూ నెమ్మదిగా బెల్టు వూడదీసి ఆమె చేతికిచ్చాడు. అందరూ ప్రాణా లుగ్గపట్టుకుని చూస్తున్నారు. ఆమె బెల్టుపట్టుకుని చటుక్కున రాంమోహన్ వంక తిరిగింది. "మిష్టర్ రాం. గేమ్ పార్టనర్ హద్దులు దాటితే పది బెల్టు చురకలు శిక్ష! మరి లైఫ్ పార్టనర్ హద్దులు దాటితే ఎన్ని దెబ్బలు తినాలంటారు?" బెల్టు ఝళిపిస్తూ తీవ్రంగా అడిగింది రాంమోహన్‌ని.

రాంమోహన్ "గీతా!" అన్నాడు ఆశ్చర్యంగా తెల్లపోతూ.

"అవును. హద్దులు మీరింది గేమ్ పార్టనర్ కాదు, లైఫ్ పార్టనర్. ఎన్ని బెల్టు చురకలు తగిలిస్తే బుద్ధి వస్తుందో చెప్పండి" సూటిగా చూస్తూ కటువుగా అంది.

పాలిపోయిన శేఖర్ మొహంలోకి రక్తం ఒక్కసారిగా పొంగింది. ఒక్కసారిగా దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు. రాంమోహను తత్తరపడిపోయాడు "గీతా, ఏమిటి?" అన్నాడు గొంతు పెగుల్చుకుని.

"ఏమిటో యింకా విడమర్చి చెప్పాలా. మిష్టరు రాం. చీట్లు తీసి పార్టనర్‌ని మార్చుకోడానికి యిది గేమ్ కాదు. లైఫ్! పార్టనర్‌ని మార్చుకోవాలంటే కోర్టు, విడాకులు చాలా తంతు వుంది."

"గీతా! యేమిటి నీ ఉద్దేశం. ఏమిటీ అల్లరి" ఆందోళనగా, భయం భయంగా అన్నాడు బెల్టువంక చూస్తూ.

"భయపడకండి-కొట్టను. ఆడదాని కంత సాహసం ఎక్కడ వస్తుందలెండి, నలుగురి ముందు కొడితే-ఆ మొగుడితో మళ్ళీ పిల్లలకోసమన్నా రాజీపడి బ్రతకవల్సిన ఆడదాన్ని-అది నాకే అవమానం కదా! ఇంట్లో పెళ్ళాంతో-బయట అవకాశంవస్తే మరో ఆడదానితో ప్రేమలు. ఎందరి జీవితాల్తో అయినా ఆటలాడగలరు మీరు. కొంమ్సు గేంలో ఎన్ని కాయిన్సు

